క్లుప్తంగా

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

రుద్రవరం: ఎంఈఓగా వీరరాఘవయ్య ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పీఈటీలు శ్రీనివాసులు, షేక్షావలి, సత్యబాబు, రేణుక, కళావతి, పెద్దయ్య తదితరులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్బరాయుడుతో కలిసి సోమవారం ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ



నగళ్లపాడులో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ వరప్రసాద్

చాగలమర్రి: ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందని, సోమవారం నగళ్లపాడు గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో సుమారు 1500 జీవాలకు నట్టల నివారణ మందులు వేశామని చాగలమర్రి ప్రాంతీయ పశువైద్య సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. వైద్యులు రవీంద్రారెడ్డి, దీపిక సిబ్బంది ఏహెచ్‌లు తిరుపతయ్య, జ్యోతిక తదితరులున్నారు.

రామయ్యకు అభినందన




రామయ్యను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

నంద్యాల(అర్బన్): నంద్యాల విద్యుత్‌శాఖ డి2 పరిధిలోని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించిన ఏఈ రామయ్యకు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించడం అభినందనీయమని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదుగా రామయ్య అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, సిబ్బంది భాస్కర్, సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం సిబ్బంది ఆయనను అభినందించారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఆళ్లగడ్డ: మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన సోమవారం బత్తలూరులో చోటు చేసుకుంది. రూరల్ మండలం బత్తలూరు గ్రామానికి చెందిన అలివేలమ్మ కిరాణ దుకాణంలో ఉండగా ఓ యువకుడు వచ్చి బబుల్‌గమ్ కావాలని అడిగాడు. అలివేలమ్మ డబ్బాలో నుంచి బబుల్‌గమ్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా మెడలో వేలాడుతున్న బంగారు గొలుసు తెంపుకొని మోటార్ సైకిల్‌పై పారిపోయాడు. గొలుసు సుమారు 4 తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులతో డీఈఓ జనార్ధన్ రెడ్డి

డోన్ టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం డోన్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి వంట గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ కేశిరాజ్ శ్రీనివాస్, వైస్ ప్రిన్స్‌పాల్ చంద్రకాంత్ యాదవ్ ఉన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

గడివేముల: గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఈఓ రామానుజన్ తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా తాత్కాలికంగా కళింగర పండ్లు, చెరుకు గడలు, ఐస్, కూల్‌డ్రింక్స్ విక్రయాలకు, సప్లయర్ సామాను బాడుగకు ఇచ్చుకునేందుకు వేలంపాటలు నిర్వహించగా రూ.3,61,000 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.1,28,000 ఆదాయం పెరిగిందని చెప్పారు.

పూలమ్మినా పూటగడవడం కష్టం

- అన్‌సీజన్ కావడంతో పడిపోయిన పూల ధరలు
- మందగించిన విక్రయాలు
- నష్టపోతున్న రైతులు, వ్యాపారులు





ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పూల వ్యాపారులు, డోన్ స్టేషన్‌లో రైలు ఆలస్యం కావడంతో పూలు కట్టుకుంటున్న మహిళలు

డోన్: పూల రైతులు, వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు లేకపోవడంతో పూల ధరలు పడిపోయాయి. కూలీలు, రవాణా చార్జీలు కూడా రావడం లేదని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విక్రయాలు లేకపోవడంతో పూల వ్యాపారులు సైతం నష్టపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూసినా కొనేవారు కరువయ్యారు. అమ్మినకాటికి అమ్మి మిగిలినవి పారబోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎగుమతి చేద్దామన్నా డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

నియోజకవర్గంలో 2 వేల మంది వ్యాపారులు

డోన్ నియోజకవర్గంలో సుమారు 2వేల మంది పూల వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో వీరి జీవనం కష్టతరంగా మారింది. అప్పులు చేసి జీవనం గడపాల్సిన పరిస్థితి తలెత్తిందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లిల్లీ, గులాబీలు దిగుమతి

ఈ ప్రాంతంలో జరిగే వివాహాది శుభకార్యాలతో పాటు ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు బెంగుళూరు నుంచి లిల్లీ, గులాబీ పూలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ లేకపోవడంతో మార్కెట్ మందగించింది. కనకాంబరాలు కిలో రూ.250, కాగడాలు కిలో రూ.300, మల్లెపూలు రూ.500 ఉన్నా లిల్లీ, చామంతి, ముద్ద బంతి పూల ధరలన్నీ కిలో రూ.30 నుంచి రూ.40కే విక్రయించాల్సి వస్తోంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

స్థానికంగా పండించే చామంతి, ముద్దబంతి, కనకాంబరాలు, మల్లె, లిల్లిపూలను వందలాది మంది వ్యాపారులు కొనుగోలు చేసి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోని రాయచూర్, బళ్లారి తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. మరికొందరు వ్యాపారులు రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేసి విజయవాడ, తాడిపత్రి, పత్తికొండ, ఎమ్మిగనూరు, గుంటూరు, హైదరాబాదు, మహబూబ్ నగర్, మార్కాపురం, కంభం ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

అప్పుల పాలయ్యాం



ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో పండించిన పూలకు సరైన ధర లభించడం లేదు. స్థానికంగా మద్దతు ధర లేకపోవడంతో పూలను పారబోయలేక వ్యాపారులకు తక్కువ ధరలకే విక్రయించాం. పెట్టుబడి మాట అటుంచితే కరెంట్ బిల్లులు, కూలీ డబ్బులు సైతం గిట్టుబాటు కావడం లేదు.
–బోయ శ్రీరాములు, పూల రైతు, ధర్మవరం

నష్టపోతున్నాం



పూలకు ప్రస్తుతం మార్కెట్ లేకపోవడంతో కొనుగోలు చేసి విక్రయిస్తామనుకున్న పూలన్నీ పారబోయాల్సిన పరిస్థితి. బహిరంగ మార్కెట్‌లో చిరు వ్యాపారం చేస్తున్నందు వల్ల ఎండకు పూల వాడిపోతున్నాయి. మరునాడే కొన్ని పూలు కుళ్లిపోతున్నాయి. దీంతో రెక్కాడితే కానీ డొక్కాడని మాలాంటి చిరు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నాం.
–లలిత, పూల వ్యాపారి, డోన్

గిట్టుబాటు కావడం లేదు



నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 2వేల మంది గంప నెత్తిన పెట్టుకుని పూల వ్యాపారం చేసేవారు ఉన్నారు. ఇక్కడి ప్రాంతాలతో పాటు పక్కనున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రాత్రిళ్లు రైళ్లలో ప్రయాణించి విక్రయాలు చేస్తుంటారు. ప్రస్తుతం సరైన విక్రయాలు జరగక నిరాశ చెందాల్సి వస్తోంది. రేయింబవళ్లు కష్టించినా పూట గడవడం గగనమైంది.
–అరుణజ్యోతి, వ్యాపారి, చిగురుమానుపేట

ప్రభుత్వం ఆదుకోవాలి



గత ప్రభుత్వం మహిళల కోసం అమ్మ ఒడి, 45 ఏళ్లు పైబడిన మహిళలకు రూ.18వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తుండేది. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లభించకపోవడం వల్ల బతుకుతెరువు కష్టంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం మాలాంటి వారి కష్టాలను గుర్తించి ఇచ్చిన హామీలను అమలు చేస్తే ఆర్థికంగా ఉపశమనం లభిస్తుంది. –అల్లింబి, పూలవ్యాపారి, కొండపేట, డోన్

పశువులపాక దగ్ధం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య పశువుల పాక సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. పాడి గేదె, ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆకతాయిలు కొట్టంపై నిప్పురవ్వలు వేయడంతో మంటలు వ్యాపించి గేదె, ఆవుకు తీవ్రంగా గాయపడ్డాయన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): రిటైర్డు జవాన్ దౌలత్‌ఖాన్ మృతికి కారకులైన మున్సిపల్ కార్యాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి 24ఏళ్లు సేవలు అందించి ఇంటి పన్ను మినహాయింపును కోరిన దౌలత్‌ఖాన్ పట్ల వ్యవహరించిన తీరుతో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందారన్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఆయన మృతికి కారణమన్నారు. అహమ్మద్‌ఖాన్, సలాం, మధు పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలోని బీసీ కులాలకు కుల గణన ద్వారా రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సంఘం ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాంబాబు, నాగేశ్వరరావు, నాగేంద్రయాదవ్, పృథ్వీరాజ్‌యాదవ్, నాగేష్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల(న్యూటౌన్): అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు విమర్శించారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో హుసేన్‌సా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పట్టణంలో అనేక మంది ఇళ్లులేని నిరుపేదలు ఉన్నారన్నారు. వారికి స్థలాలు ఇవ్వాలని పలుమార్లు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించామన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అన్ని వార్డుల్లో నిరుపేదల నుంచి దరఖాస్తులే తీసుకొని 5న టెక్కె మార్కెట్‌యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తామని తెలిపారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, సుశీలమ్మ, లక్ష్మీదేవి, పట్టణ కార్యదర్శులు మద్దిలేటి, మద్దయ్య, చాంద్ బాషా, సిద్దిఖ్, శీను పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతులు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(అర్బన్): నందికొట్కూరులోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వసతుల కల్పనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ కోరారు. 2,500 కుటుంబాలు నివాసం ఉన్న నందికొట్కూరు జగనన్న కాలనీ వాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వసతులు కల్పించి స్థానికులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద కాలనీ వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంతో పాటు రోడ్లు, అంగన్‌వాడీ పాఠశాల, వీధిలైట్లు, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పుల్లానరసింహ, శివ, బాబు, నందికొట్కూరు సీపీఎం నాయకులు ఉస్మాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న రఫీ

నంద్యాల(న్యూటౌన్): నారాయణ విద్యాసంస్థల్లో ఫీజులు వేధింపులు ఆపాలని, ఫీజుల వసూలుపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల ప్రాణాలు కాపాడటంలో లేదా అంటూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ అన్నారు. సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతపురంలో విద్యార్థి మరణానికి కారకులైన మంత్రి నారాయణను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ప్రాణాలు పోయినా విద్యాశాఖ మంత్రి కన్నెత్తి కూడా చూడకపోవడం బాధాకరమన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు షాహీద్, నాయకులు మధుకిరణ్, బాలాజీ, హరి, వంశీ, రమణ, వెంకట్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం



స్పందనలో పాల్గొన్న అధికారులు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన మండల స్థాయి అధికారులతో వారు మాట్లాడుతూ ఏదైనా సమస్యలు అర్జీ రూపంలో వచ్చినప్పుడు ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కొందరు అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఫిర్యాదులలో బాధితులు పేర్కొన్నారన్నారు.



కాలి బూడిదయిన పశువుల పాక



ప్రాణాలతో బయటపడిన జీవాలు

తప్పిన ప్రమాదం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధమైంది. ఆ సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు పాకలోకి దూరి గొర్రెలు, మేకలను తప్పించడంతో ప్రాణాలతో బయటపడ్డాయి. గ్రామానికి చెందిన ఉప్పరి పెద్ద తిమ్మయ్య గొర్రెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. దాదాపు 200 మూగజీవాలు ఉన్నాయి. రాత్రి అగ్ని ప్రమాదంలో మూడు జీవాలు మృతి చెందగా మిగతావన్నీ బయట పడటంతో రైతు ఊపిరి పీల్చుకున్నాడు.

శ్రీకృష్ణదేవరాయల పాలన ఆదర్శం



దొర్నిపాడులో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

దొర్నిపాడు: శ్రీకృష్ణ దేవరాయలు పాలన తరతరాలకు ఆదర్శమని నంద్యాల పార్లమెంటరీ స్థాయి రైతుసంఘం అధ్యక్షుడు సిద్దిసత్యనారాయణ అన్నారు. సోమవారం రాయల జయంతిని పురస్కరించుకొని దొర్నిపాడులో ఆయన విగ్రహానికి పాలాభిషేకం అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పాలనను కొనియాడారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు సిద్దినారాయణ, పగడాల రమేష్, భూపనపాటి శేఖర్, చింతల గుర్రప్ప, రవి, సంజీవరాయుడు, వెంకటేశుడు, సోమశేఖర్, ప్రతాప్, నరసింహుడు, జిల్లా సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : శ్రీ కృష్ణదేవరాయుల పాలన ఎన్నటికీ ఆదర్శనీయమని బలిజ సంఘం కోశాధికారి అర్జిగారి నరసింహుడు అన్నారు. సోమవారం రాయల జయంతిని పురస్కరించుకుని స్థానిక కమతం వీధిలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు జింకా వెంకటస్వామి, సంఘం సభ్యులు కమతం చిన్న రాముడు, బల్లారి హుసేనయ్య పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో బలిజ సంఘం కార్యాలయంలో సోమవారం శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు వైవీ రామకృష్ణయ్య, కామిని మల్లికార్జున మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు సనాతన ధర్మాన్ని పాటించడంలో, హిందూ దేవాలయాల నిర్మాణానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సమర్థవంతమైన పరిపాలన శక్తివంతమైన విదేశీ వాణిజ్యం, నీటిపారుదల, నీటి నిర్వహణ వ్యవస్థ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తెలుగు, కన్నడ, తమిళం, సంస్కృతంలో లలిత కళలు, సాహిత్యాన్ని ప్రొత్సహించిన మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సంఘ శ్రీనివాసులు, గురుప్రసాద్, సుబ్బరాయుడు, కాశీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రదోషకాల పూజలు



ప్రత్యేక అలంకారంలో నందీశ్వరుడు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంటలో వెలసిన శ్రీ నాగ లింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ నందీశ్వరుడికి పంచామృత అభిషేకాలు, గంధాభిషేకం, ప్రత్యేక అలంకరణ గావించి మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే..మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, క్షీరాభిషేకం, నాగాభరణం అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు.

యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన సానియా ఈ నెల 24వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తండ్రి అబ్దుల్ రసూల్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బనగానపల్లెలో వ్యక్తి అదృశ్యం

బనగానపల్లె రూరల్: పట్టణానికి చెందిన కోడి రవికుమార్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కరెంట్ ఆఫీస్ ఏరియాలో నివాసం ఉంటున్న పుల్లయ్య కుమారుడు రవికుమార్ స్థానిక సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన చెన్నమ్మతల్లి భజన మండలి వారి భజన కార్యక్రమం భక్తులను అలరించింది. మమగణపతిం, శివశివ శంకరా, శంభో హరహర మహాదేవ, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, కైలాసగిరివాసా తదితర భక్తి గీతాలు, భజన కీర్తనలను బాలకుళ్లాయప్ప, శ్రీనివాసులు, వెంకటరంగారెడ్డి, తిరుపాలరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు ఆలపించారు.

వైభవంగా మహానందీశుడి పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో పుష్యమాసం, బహుళ త్రయోదశిని పురస్కరించుకుని సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు స్వామి, అమ్మవారి దంపతులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు.

కొనసాగుతున్న భక్తజనసందడి

మహానందిలో భక్తజన సందడి కొనసాగుతుంది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. రాత్రి స్వామివారికి ఏకాంతసేవ పూజలను వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టారు.

మొక్కజొన్న పొలాల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఊటకొండ గ్రామంలో పలువురు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్టు రామకృష్ణారావు, కోఆర్డినేటర్లు రమణమ్మ, వెంకటరమణ, సుజాతమ్మ, వ్యవసాయాధికారి రాజేశ్ సోమవారం పరిశీలించారు. మొక్కజొన్న మొక్కలకు ఆకులు చివరి భాగంలో విసనకర్ర ఆకారంలో ఉండి కండెలు గుత్తులుగా ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇలా ఏర్పడటానికి గల కారణాలను తెలుసుకునేందుకు కండెలను సేకరించారు. విత్తనం కారణంగా ఈ సమస్య తలెత్తిందా లేక వైరస్ నుంచి వ్యాపించిందా అనే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. రైతులు ఏటా ఒకే పంటను కాకుండా పంటమార్పిడి చేయడం ద్వారా ఇలాంటి సమస్యలు తలెత్తవని తెలిపారు.

పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పైరులో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం కోవెలకుంట్ల మండలం రేవనూరులో చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. పంటకోత ప్రయోగంలో ఎకరాకు 5.3 క్వింటాళ్లు వచ్చేలా రికార్డు అయిందని పేర్కొన్నారు. ఈ ఏడాది రబీసీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పంట ఆధారంగానే నష్ట పరిహారం, ఇన్సురెన్స్, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కంది సాగు చేసిన రైతులు దిగుబడులు విక్రయించేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. క్వింటా రూ. 7,500 మద్దతు ధరతో కందులను విక్రయిస్తున్నట్లు వివరించారు.

వాహనం ఢీకొని.. వ్యక్తికి తీవ్రగాయాలు

పాణ్యం: స్థానిక పాత పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. హైవే మరమ్మతుల కారణంగా వన్‌వేలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. సోమవారం పాణ్యం చెంచుకాలనీ నుంచి హైవే దాటుతున్న ఓ వ్యక్తిని ట్రాలీ వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.